# స్థిరాస్తుల భద్రతే లక్ష్యం




## అక్రమ రిజిస్ట్రేషన్లపై చంద్రబాబు సర్కారు ఉక్కుపాదం

చంద్రబాబు సర్కారు వచ్చిందే తడవుగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన ప్రారంభించింది. అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం మోపింది. అడ్డగోలు రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు విధించింది. ప్రజల స్థిరాస్తులైన భూములు, స్థలాలు తదితరాల రక్షణకు చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో ప్రజల స్థిరాస్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు అడుగులు వేస్తోంది. రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజల సమయం వృథా కాకుండా స్లాట్ బుకింగ్‌తో ముందుకెళుతోంది. ఇలాంటి నిబంధనలతో రిజిస్ట్రేషన్లు సాగుతుండడంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ రాబడి భారీగా పడిపోయింది. అయినా సరే.. ప్రజల ఆస్తుల భద్రతే లక్ష్యంగా పనిచేయాలంటూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను చంద్రబాబు ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

- 2024-25ఆర్థిక సంవత్సరంలో 18-20వేల డాక్యుమెంట్లు తగ్గుదల
- తగ్గిన రిజిస్ట్రేషన్ల రాబడి

కడప కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం స్థిరాస్తుల భద్రత గాలి కొదిలేసి, భయాందోళనలకు గురిచేశారు. తినోతినకో కూడబెట్టి సంపాదించిన భూములు, స్థలాలు కాపాడుకునేందుకు సగటు మనిషి కంటిమీద నిద్దురలేని రోజులు గడిపారు. నాడు ప్రభుత్వ డీకేటీ, అసైన్డ్ భూములు, నిషేధిత జాబితా భూములు, ఫ్రీహోల్డ్ భూములు, అనుమతులు లేని అక్రమ లే-ఔట్ల రిజిస్ట్రేషన్లతో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు వైసీపీ నేతల గుప్పిట్లో అన్నట్లుగా రిజిస్ట్రేషన్లు సాగాయి. అంతే కాకుండా అప్పటి జగన్ సర్కారు 6 పర్యాయాలు యూజర్ చార్జీల వడ్డనతో పాటు పట్టణ ప్రాంతాల్లో 50-100శాతం పైబడి భూముల ధరలు పెంచడంతో స్థిరాస్తి దారుల జేబులు పిండేశారు. దీంతో జిల్లా నుంచి స్థిరాస్తులు, ఇతరత్రా రిజిస్ట్రేషన్ల రూపేణా ఏటా దాదాపు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు ముక్కు పిండి ఆదాయం రాబట్టగలిగారు. అయితే జగన్ జమానాలో స్థిరాస్తుల భద్రత విషయంలో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు ఉండేవి.

### భద్రత పెరిగింది.. ఆదాయం తగ్గింది

గత ఏడాది ఎన్నికల్లో చంద్రబాబు స్థిరాస్తుల భద్రతకు భరోసా ఇచ్చారు. కూటమి సర్కారు కొలువు తీరగానే రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టారు. దీంతో గత 2024-25 ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.391 కోట్లకు పడిపోయింది. జిల్లాలో ఏటా 90 వేల వరకు డాక్యుమెంట్లు జరిగేవి. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు 18-20వేల వరకు డాక్యుమెంట్లు తగ్గాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు జిల్లా నుంచి దాదాపు రూ.100 కోట్ల ఆదాయం కోల్పోయినట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో అక్రమ లేఅవుట్లు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో వెలసిన వెంచర్లలో సాగిన అమ్మకాలు, కొనుగోళ్ల వ్యవహారం ఇప్పుడు బట్టబయలు అవుతోంది. జిల్లాలో ఐదేళ్ల జగన్ పాలనలో ఇసుమంత అభివృద్ధి జరగకపోగా హైదరాబాద్ కోకాపేటకు దీటుగా ఇక్కడ స్థలాల ధరలు ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఢమాల్ అయ్యాయని అంటున్నారు. అంతే కాకుండా కొందరు భూములు, స్థలాల కొనుగోళ్ల పెట్టుబడులను బంగారం, షేర్ మార్కెట్‌లకు మళ్లించడం కూడా రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం పడిపోవడానికి కారణమని అంటున్నారు.

### అత్యధికంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్లే

వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగితే 7.5శాతం రిజిస్ట్రేషన్ రుసుంతో ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. కానీ వైసీపీ అధికారం కోల్పోయాక, అడ్డగోలు భూఆక్రమణలు, అనుమతులు లేని లే-అవుట్లు, తప్పుడు రిజిస్ట్రేషన్ల బాగోతం బయట పడుతుండటంతో రిజిస్ట్రేషన్లు మందగించాయంటారు. ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లలో అత్యధికంగా అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, తల్లిదండ్రులు బిడ్డలకు ఇచ్చే గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు, సొసైటీ డాక్యుమెంట్లు రిలీజ్, తప్పొప్పుల సవరణలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, పవర్ ఆఫ్ అటార్నీ, దత్తత, డాక్యుమెంట్స్ క్యాన్సలేషన్ లాంటివి ఉన్నాయి. వీటికి 2.5 నుంచి 4.5 శాతం వరకు మాత్రమే ఫీజులు ఉంటాయి. ఇది కూడా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం భారీగా తగ్గడానికి కారణమని అంటున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం తగ్గినా తమ ఆస్తులకు భద్రత దొరకడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అడ్డగోలు రిజిస్ట్రేషన్లకు ఆస్కారం లేదు



పక్కాగా డాక్యుమెంట్లు ఉంటేనే స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. రిజిస్ట్రేషన్లకు వచ్చే స్థిరాస్తిదారులకు అన్ని విషయాలు తెలియజేస్తున్నాం. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రభుత్వం తెచ్చిన స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖలో ఆదాయం తగ్గింది. ప్రజల ఆస్తులకు భద్రత విషయంలో ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలు పాటిస్తుండడంతో పాటు భూముల కన్వర్షన్, ఇతర అనుమతులు లేని లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోవడం వల్ల ఆదాయం భారీగా తగ్గింది.

- పీవీఎన్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

# మట్టి అక్రమరవాణా అడ్డుకుంటాం

- కేసీ కెనాల్ డీఈ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తే అడ్డుకుంటామని కేసీ కెనాల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.చిన్నపుల్లయ్య తెలిపారు. దువ్వూరు మండల పరిధిలోని కుందూనది ఒడ్డున ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తుండటంపై ఈ నెల 11వ తేదీన 'మట్టిని మింగేస్తున్నారు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాట్లాడుతూ పత్రికలో వార్త వచ్చిన వెంటనే తన సిబ్బందితో కలిసి పరిశీలించానన్నారు. కుందూనది విస్తరణ పనుల్లో భాగంగా నిల్వచేసిన మట్టిని కొంత మంది తరలించారని గుర్తించామని తెలిపారు. ఈ మట్టి తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. భవిష్యత్తులో మట్టి అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# కార్పొరేషన్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యం

- నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశానికి భద్రత కల్పించాలి
- వైసీపీ కార్పొరేటర్లు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని, కమిషనర్ సహా అధికారులంతా నియంతల్లా వ్యవహరిస్తున్నారని పలువురు వైసీపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఈనెల 20న నగరపాలక సర్వసభ్య సమావేశం సజావుగా జరిగేలా కలెక్టర్, ఎస్పీ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే జేసీ, ఎస్పీలకు వినతిపత్రం సమర్పించామన్నారు. మంగళవారం కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు పాకా సురేశ్, కె.బాబు, శివకోటిరెడ్డి, బాలస్వామిరెడ్డి, మక్బూల్ బాష, రామలక్ష్మణరెడ్డి, డిష్ జాని, ప్రసాద్‌రెడ్డి, పలు డివిజన్ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ ఆరునెలలుగా నగరపాలక సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశాలు నిర్వహించకుండా టీడీపీకి అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశం హాలును తెరవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకుండా తాళాలను కమిషనర్ వద్దనే ఉంచుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. గత సమావేశాలలో చేసిన తీర్మానాలను కూడా అధికారులు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరపాలక సంస్థకు ఒక్కరూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. జనరల్ ఫండ్ ద్వారా ప్రజలు కట్టిన పన్నులను వివిధ కార్యక్రమాలకు వాడుతున్నారని దుయ్యబట్టారు. 20న జరిగే సర్వసభ్య సమావేశంలో పెంచిన పన్నులపై, ప్రజా సమస్యలపై చర్చించాల్సి ఉన్న దృష్ట్యా గట్టి పోలీస్ బందోబస్తు కల్పించాలని కోరారు. నగర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించాల్సి ఉన్న దృష్ట్యా భద్రత కల్పిచాలని వారు డిమాండ్ చేశారు.

# రాచమల్లు అవినీతిని వెలికితీస్తాం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు పాల్పడిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వరి టెంపుల్ నిర్వాహకుల నుంచి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు రూ.3 కోట్లు తీసుకున్నారని, ఆయన తమపై విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డికి సంబంధించిన భూమి ఆర్ఎస్ఆర్‌లో చెరువు ఉందని తెలియడంతో ఫిర్యాదు చేశామని, ఆ తర్వాత వారు హైకోర్టుకు వెళ్లడం, కోర్టు తీర్పుతో ఫిర్యాదును పక్కన పెట్టామన్నారు. ఆర్యవైశ్యులకు అప్పు ఎగ్గొట్టినట్లు పేర్కొనడం తగదన్నారు. పట్టణంలో ఏ ఒక్క ఆర్యవైశ్యునికైనా బాకీ ఉన్నట్లు వారిని పిలుచుకొస్తే డబ్బులు చెల్లిస్తామన్నారు. 40 యేళ్ల రాజకీయాల్లో తానుకానీ, తన కుటుంబం కానీ ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులే గుట్కా, మట్కా ఆడుతున్నారని పోలీసులు కూడా కొంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. మీ పాలనలో తహశీల్దారు కార్యాలయం, పోలీసు స్టేషన్లలో ఎన్నో అక్రమాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత అవినీతిపరుడైన మాజీ ఎమ్మెల్యేకు ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. వైసీపీ నాయకులు చేసిన అరాచకాల వలన నేడు వారు ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, ఆనందభార్గవరెడ్డి, లక్ష్మీపేట గురివిరెడ్డి, మార్తల గురివిరెడ్డి, వెల్లాల భాస్కర్ పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల కోసం మహాగురుకులం

- 15 రోజుల్లో అడ్మిషన్లు పూర్తి కావాలి
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర మహాగురుకులం విద్యాలయాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాగురుకులం విద్యాలయం పెండింగ్ పనులు, వసతులు, విద్యార్థుల అడ్మిషన్ల అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకున్న మహాగురుకులంలో దాదాపు వెయ్యిమంది విద్యార్థులకు వసతి సౌకర్యం ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరానికి గాను 460 మంది విద్యార్థులతో అడ్మిషన్లు 15 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. మహాగురుకులంలో చేరేందుకు అర్హులైన పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో సీటు అందని విద్యార్థులకు మహాగురుకులంలో అడ్మిషన్లు కల్పించాలన్నారు. రూ.21 కోట్లతో మహాగురుకులం నిర్మాణం పూర్తి చేశారన్నారు. అయితే.. పెండింగ్ పనులు పూర్తి చేయడంలో అలసత్వం వహించిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిషన్లు పూర్తయ్యేలోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ, డీఈవో షంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపీసీఏ రామలింగరాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# 21న జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర

కడప కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి గ్రామస్థాయి మొదలు జిల్లాస్థాయి వరకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో యోగాంధ్ర కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇది వరకే పర్యాటక కేంద్రాలైన ఒంటిమిట్ట, సిద్దవటం, శిల్పారామంలలో యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 18న గండికోటలో యోగాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,750 మంది శిక్షకుల ద్వారా 5.60 లక్షల మందికి యోగపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 9 లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలో 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను ఉదయం 7 గంటల కల్లా కచ్చితంగా ప్రారంభించి 8 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతికుటుంబం ఈ యోగ శిక్షణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బార్లు, మద్యం దుకాణాల తనిఖీ



బార్‌లో మద్యం క్వాలిటీని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్

కడప క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బార్లు, మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. స్టాకు వివరాలు, మద్యం విక్రయాల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాలు దాటి మద్యం విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మద్యం దుకాణాల్లో మందుబాబులను కూర్చోబెట్టి తాపడం చేస్తే చర్యలు తప్పవన్నారు. బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 వరకు మాత్రమే వ్యాపారం చేయాలని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించమన్నారు.

# డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- హెచ్చరించిన కలెక్టర్



కడప కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవల విభాగం కింద జిల్లా వ్యాప్తగా 10 నెట్‌వర్క్ ఆసుపత్రులపైన 18 మంది పేషెంట్లు ఐవీఆర్ ద్వారా అందించిన ఫిర్యాదుల మేరకు ఈ సమావేశంలో కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల్లో అదనపు వసూళ్లకు పాల్పడిన వారికి పెనాల్టీ విధించామన్నారు. పేషెంట్ల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని వారికి తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు వైద్యవృత్తి శాశ్వితంగా రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ నాగరాజు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ బాలాంజనేయులు, డీసీహెచ్ఎస్ హిమదేవి, సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులు సత్వరమే పూర్తిచేయాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీసీవో హజరత్తయ్య, ఈఆర్పీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, డీడీ వెంకటసాయి, హౌసింగ్ పీడీ రాజరత్నం పాల్గొన్నారు.

# ఇదేంది.. గురు.?

- గురుకుల పాఠశాలలో ప్రారంభం కాని తరగతులు
- ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు లేక..విద్యార్థులను ఇంటికి పంపుతున్న సిబ్బంది




తరగతులు ప్రారంభంకాని కొండాపురం గురుకుల పాఠశాల

కొండాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో తరగతులు ప్రారంభం కాలేదు. ఈ పాఠశాలలో ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉంది. ప్రతి ఏడాది సుమారు 500 మంది విద్యార్థులు చదువుకునే ఈ పాఠశాలలో ఇంకా తరగతులు ప్రారంభం కాకపోవడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇదివరకు పనిచేసిన ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. ఈ పాఠశాలలో అంతా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులే పనిచేస్తున్నారు. వారికి ప్రస్తుతం బదిలీలు జరుగుతున్నాయని సిబ్బంది తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులను వెనక్కి పంపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విధుల్లోకి చేరిన తర్వాత తమ పిల్లలను రమ్మని సిబ్బంది చెబుతున్నారని వారంటున్నారు. వెంటనే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కేటాయించి పాఠశాలలో తరగతులు ప్రారంభించకపోతే ఆందోళన చేస్తామని ఎంఆర్పీఎస్ నాయకులు నాగసుబ్బరాయుడు, శ్రీనివాసులు తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని వారు కోరారు.

### బదిలీల వల్ల ఉపాధ్యాయులు లేరు

కొండాపురం గురుకుల పాఠశాలకు ఇంతవరకు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరు. ఒప్పంద ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఒప్పంద ఉపాధ్యాయులకు ప్రస్తుతం బదిలీల కౌన్సెలింగ్ జరుగుతున్నందువల్ల పాఠశాలకు వారు రాలేదు. గురువారం నుంచి కొత్త కాంట్రాక్టు ఉపాధ్యాయులు వస్తారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ ఎవ్వరూ కొండాపురం రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి ప్రిన్సిపాల్‌ను నియమించమని కోరాము. గురువారం నుంచి యథావిధిగా తరగతులు జరుగుతాయి.

- ఉదయశ్రీ, గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్

# బ్యాంకుల వద్ద సందడి

కడప ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు బ్యాంకులు మంగళవారం ఉదయం పది గంటల నుంచే కిటకిటలాడాయి. విద్యార్థులకు సంబంధించి తల్లికి వందనం నిధులు చంద్రబాబు ప్రభుత్వం జమచేసిన విషయం విదితమే. ఆ నిధులను పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు అయ్యే తక్షణ ఖర్చుల కోసం డ్రాచేసేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బ్యాంకుల వద్దకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. కడప నగరంలోని ఎస్‌బీఐతో పాటు, పోస్టాఫీస్, పలు బ్యాంకులు విద్యార్థుల తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. బ్యాంకు ఖాతాలో పడిన డబ్బులు విత్‌డ్రా చేసేందుకు కొందరు.. డబ్బులు జమ అయ్యాయో లేదోనన్న సమాచారం తెలుసుకునేందుకు మరికొందరు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు.



తల్లికి వందనం డబ్బులు తీసుకుంటున్న తల్లులు




తల్లికి వందనం డబ్బు డ్రా చేసేందుకు హెడ్ పోస్టాఫీస్ వద్ద బారులు తీరిన తల్లులు

## డైట్ మ్యాగజైన్‌కు రచనలు పంపండి

రాయచోటి టౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రతి నెలా వెలువరిస్తున్న పత్రికలో ప్రచురణల కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి వివిధ అంశాలపై రచనలను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక డైట్ విద్యా కేంద్రంలో అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికలో విద్యా విషయక విజ్ఞాన అంశాలను ప్రచురిస్తామన్నారు. పాఠశాలల్లో అమలు చేసే వినూత్న పద్ధతులు, సృజనాత్మక బోధన విధానాలను ఈ పత్రిక ద్వారా తెలియజేయవచ్చునన్నారు. అనంతరం పత్రిక ఎడిటర్, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడు తూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు పంపవచ్చునన్నారు. రచనలు తమ స్వంతమేనని, ఇంతవరకు ప్రచురితం కాలేదని రచనతో పాటు ధ్రువీకరణ పత్రం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రావు, సుబ్బారెడ్డి, కేధార్నాధ్, రెడ్డెయ్య, మోహన్‌నాయక్, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఖేదం.. ఆర్టీసీకి మోదం!

● కార్గోకు గణనీయంగా పెరిగిన బుకింగ్స్
● అదే దారిలోనే ఆదాయం..


పీలేరు ఆర్టీసీ కార్గో కార్యాలయంలో మామిడిపండ్ల పార్శిళ్లు



బస్సులో లోడ్ చేస్తున్న కార్మికుడు

పీలేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ ఏడాది కాసింత ఖేదం మిగిల్చినా ఆర్టీసీ కార్గో కు మాత్రం మామిడి మోదం కలిగిస్తోంది. దూరప్రాంతాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లు పంపేందుకు చాలా మంది ఆర్టీసీ కార్గోను ఆశ్రయిస్తుండడంతో ఈ ఏడాది కార్గో ఆదాయం పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి బుక్కింగులు ఆశాజనకంగా ఉన్నాయని, ఈ నెల ఆఖరుకు అవి బాగా పెరిగే అవకాశం ఉందని పీలేరులోని కార్గో సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇతర కార్గో సంస్థల కంటే ఆర్టీసీ కార్గోలో ధరలు తక్కువగా ఉండడం, సకాలంలో డెలివరీ చేస్తుండడంతో సాధారణ ప్రజలతోపాటు కొంత మంది ఔత్సాహిక ఉత్పతిదారులు కూడా తమ వినియోగదారులను చేరుకోవడానికి ఆర్టీసీ కార్గోను ఎంచుకుంటున్నారు.

**రాష్ట్రమంతటా సేవలు**

పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాలకు కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాదులోని కొన్ని ప్రాంతాలు, బెంగళూరులోని మెజెస్టిక్ , చెన్నైలోని మాధవరం బస్టాండులకు పీలేరు నుంచి మామిడి పండ్లను కార్గో ద్వారా పంపవచ్చు. అయితే వీటికి డోర్ డెలివరీ ఉండదు. ఆయా ఊళ్లలో కార్గో కార్యాలయాల వద్దకు వెళ్లి వినియోగదారులే పార్శిళ్లు తీసుకోవాల్సి ఉంటుంది.

**పెరిగిన ఆదాయం**

మామిడి పండ్లను రవాణా చేయడం ద్వారా ఆర్టీసీకి మామిడి సీజన్‌లో గణనీయమైన ఆదాయం లభిస్తోంది. పీలేరు కార్గో కార్యాలయం ద్వారా గత ఏడాది మే నెలలో రూ.2.81 లక్షల వ్యాపారం జరుగగా ఈ ఏడాది రూ.3.24 లక్షలకు చేరుకుంది. గత ఏడాది జూన్‌లో రూ.2.77 లక్షలు రాగా, ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికే రూ.2.58 లక్షలు వచ్చాయి.

**మామిడి రవాణా ధరలు ఇలా..**

పీలేరు నుంచి 60 కిలోమీటర్లకు 25 కేజీలకు రూ.70లు, 25 నుంచి 50 కేజీలకు రూ. 100లు రుసుము వసూలు చేస్తున్నారు. 60 కిలో మీటర్లు దాటిన తరువాత 10 కేజీలకు రూ.90లు, ఆ తరువాత ప్రతి 10 కేజీలకు రూ.30ల నుంచి రూ. 40లు అధికంగా చార్జ్ చేస్తారు. మనం ఎంచుకున్న పట్టణానికి డైరెక్టు బస్సు లేకపోతే రూ.30 నుంచి రూ.40 అదనంగా వసూలు చేస్తారు.

**డెలివరీ పద్ధతి బాగుంది**



ఆర్టీసీ కార్గో ద్వారా పంపుతున్న మామిడి పండ్లు వినియోగదారులకు సకాలంలో అందుతున్నాయి. తద్వారా మాపై నమ్మకం పెరిగి వ్యాపారం కూడా పెరిగింది. ఇతర కార్గో సంస్థల కంటే రవాణా చార్జీలు కూడా తక్కువగా ఉన్నాయి.

- ధర్మారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, పులిచెర్ల

**సద్వినియోగం చేసుకోవాలి**



రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఊళ్లకు పీలేరు నుంచి కార్గో సేవలు అందిస్తున్నాం. రైతులు, సాధారణ ప్రజలు ఆర్టీసీ కార్గోను ఉపయోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు మామిడి పండ్లను సురక్షితంగా పంపుకోవచ్చు. పచ్చి సరుకు కావడంతో డోర్ డెలివరీ ఇవ్వలేకపోతున్నాం.

- జావెద్, కార్గో ఆపరేటర్

## ఎర్రచందనం స్వాధీనం


ద్విచక్రవాహనంతోపాటు ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంతో సహా రూ. 2.50 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎం. గురుప్రభాకర్ తెలిపారు. మంగళవారం పీలేరు పారెస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు సోమల మండలం కందూరు వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం తెల్లవారు జామున కలికిరి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం సోమలవైపు వెళ్లిందన్నారు. దానిని వెంబడించగా సోమల సమీపంలో రోడ్డుపక్కన వాహనాన్ని ఆపి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారని తెలిపారు. వాహనంపై రెండు గోనె సంచుల్లో ఉన్న 34 కిలోల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దిచక్ర వాహనంతోపాటు ఎర్రచందనం దుంగలను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాష్, ఎఫ్‌బీవో ప్రతాఫ్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి వృద్ధురాలి మృతి


బావిలో వృద్ధురాలి మృతదేహం

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీళ్లలేని బావిలో పడి భిక్షాటన చేసుకునే రెడ్డెమ్మ(65) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని చెన్నారెడిపల్లెకు చెందిన ఆదెప్ప భార్య రెడ్డెమ్మ కొన్నేళ్లుగా చెంబకూరులో ఉంటూ భిక్షాటనతో జీవించేది. ఈమెకు మద్యం తాగే అలవాటు ఉండేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెడ్డెమ్మ మంగళవారం ఉదయం చెంబకూరు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బావిలో నుండి వెలికి తీసి, పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

రామసముద్రం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కాప్పల్లెకు చెందిన సంతోష్ భార్య అహల్య(27) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయచోటిటౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం అర్ధరాత్రి అనంతరం హాస్పిటల్ సిబ్బంది మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తల, ముఖం చేతిపై రక్తగాయాలు ఉండడంతో ఇక్కడే చంపారా, బయట చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి మైనారిటీ వర్గానికి చెందిన వాడుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలియజేశారు.

## విద్యుదాఘాతానికి గొర్రెలు బలి


విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన గొర్రెలు

పెద్దతిప్పసముద్రం జూన్ 17 (ఆంధ్రజ్యోతి ) : ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సెల్ టవర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఓ నిరుపేదకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. బాధితులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని టి. సదుం పంచాయతీకి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన జరాల ఆంజనేయులు అనే వ్యక్తి గొర్రెలు మేపుకుని తన కుటుంబాన్ని పోషించుకునే వాడు. మంగళవారం గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఓ సెల్ టవర్ దగ్గర మేపుకుంటుండగా, ఎలాంటి కంచె లేక పోవడంతో సెల్ టవర్ కిందకు వెళ్లిన రెండు గొర్రెలు అక్కడున్న ఎర్త్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. దీంతో సెల్ ట వర్ స్థలం యజమాని వద్దకు వెళ్లి అడగగా తమకు సంబంధం లేదని, విద్యుత్ శాఖ అధికారులను అడగాలని చెబుతున్నారని, విద్యుత్ అధి కారులను అడిగితే, సెల్ టవర్ వాళ్లు చూసుకోవాలని సమాధానం చెబు తున్నారని బాధితుడు వాపోయాడు. ఈ సెల్ టవర్ మెయిన్ రోడ్డు సమీపంలోనే ఉండడంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

## రెండు కార్లు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

పీలేరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన పీలేరు - కడప జాతీయ రహదారిలోని జంగంపల్లె క్రాస్ వద్ద చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ పాళ్యంగడ్డ హరిజనవాడకు చెందిన యాటా చంద్ర, సుబ్బరాయుడు దేవపట్ల నుంచి చెన్నైకి కారులో వెళుతుండగా పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ జంగంపల్లె క్రాస్ వద్ద చెన్నై నుంచి కర్నూలు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో యాటా చంద్ర, సుబ్బరాయుడు, డ్రైవర్ ప్రసన్నకుమార్, ఢీకొన్న వాహనంలో ప్రయాణిస్తున్న ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సంఘటనా స్థలం నుంచి 108 వాహనంలో పీలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో చంద్ర కుడికాలు నుజ్జునుజ్జు కాగా, సుబ్బరాయుడుకు ఎడమచేయి విరిగి, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పీలేరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అడవిపంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అడవి పంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయప్రసాద్ రావు, బురకాయలకోట సెక్షన్ ఆఫీసర్ మోబీన్‌తాజ్ తెలిపారు. మండలంలోని బురకాయలకోట, వేపూరికోట, నేరేడుకొండ బీట్లలో అడవి పందులను వేటాడి వాటి మాసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు ములకలచెరువు మండలం వడ్డిపల్లె సమీపంలో దాడులు నిర్వహించి శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాలాజీ(23), స్థానిక రామాపురానికి చెందిన మంజునాథ(30)ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి అడవి పంది మాంసం, వేటాడే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

## పిల్లల బాధ్యత నాది..: డీఈవో


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

ఒంటిమిట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బాధ్యత నేను తీసుకుంటామనని జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్ హామీ ఇచ్చారు. మండలంలోని చిన్నకొత్తపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 6, 7, 8 తరగతులను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలలు పునఃప్రారంభం నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. తమ పిల్లలను ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలకు పంపేది లేదని భైఠాయించారు. దీంతో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్, ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు చిన్నకొత్తపల్లెకు విచ్చేసి తల్లిదండ్రులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలను కాపాడుకునేందుకు మీరు చేస్తున్న పోరాటం గొప్ప విషయమన్నారు. అందుకు తాము కూడా అభినందనలు తెలుపుతున్నానన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పాఠశాలల గురించి పట్టించుకునేవారే కరవయ్యారన్నారు. కొద్దిరోజులపాటు ఒంటిమిట్ట పాఠశాలకు పిల్లలను పంపించాలని, త్వరలో చిన్నకొత్తపల్లె పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చే అవకాశం ఉందన్నారు. అప్పుడు తిరిగి మీ పిల్లలు ఈ పాఠశాలకే వస్తారన్నారు. అప్పటి వరకు ఒక్కో విద్యార్థికి ఆటో ఖర్చులకు నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆస్తి అంతస్తులు తరుగుతాయని, తరగని ఆస్తి విద్య ఒక్కటేనన్నారు. విద్య ఉంటే వారి కాళ్లపైన వారే నిలబడతారన్నారు. ఈ పాఠశాలను దత్తుకు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని కృష్ణంపల్లె, సింహాద్రిపురం పాఠశాలను కూడా దత్తు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దారు దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీ, మండల విద్యాశాఖాధికారి వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట చెరువు సంఘం వైస్ ఛైర్మన్ కట్టా యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### యూఈఈయూ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు


కనుపర్తి కిరణ్


ఏవీ రమణ


సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీలో రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురు నాయకులకు చోటు కల్పిస్తూ రాష్ట్ర నాయకత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 11వ రాష్ట్ర స్థాయి మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కనుపర్తి కిరణ్, రాయచోటి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఏవీ రమణ, రైల్వేకోడూరు నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వి. సుబ్రహ్మణ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవులు ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్మికుల కోసం నిరంతరాయంగా పని చేస్తామని తెలిపారు.

### బి.కొత్తకోటలో స్థల వివాదం..

● అధికారుల జోక్యంతో నిర్మాణానికి బ్రేక్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో శ్మశానానికి అనుకుని వున్న ఓ స్థలంలో మంగళవారం కొందరు పునాదినిర్మాణం చేపట్టగా, మరోవర్గం అడ్డుతగిలింది. స్థలంపై హక్కు తమదంటే.. తమదంటూ ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. విషయం పోలీసులు, రెవిన్యూ అధికారులకు చేరడంతో సంఘటనాస్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. సివిల్ సమస్య కాబట్టి న్యాయపరంగా పరిష్కరించుకోవాలని, పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ ప్రాబ్లం రాకుండా చూడాలని పోలీసులు ఆదేశించారు. ఎవరికి హక్కుందో తేల్చుకోవాలని, అంతవరకు నిర్మాణం ఆపాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు. దీంతో ప్రస్తుతానికి నిర్మాణానికి బ్రేక్‌పడింది. కాగా ఈ స్థల వివాదం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

### 'ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనం విడుదల చేయాలి'

రైల్వేకోడూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన, వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆశాజ్యోతి అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ పేర్కొన్నారు. మంగళవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంకాం ఉన్నత వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్, మదన్మోహన్, దివన్, విజయ్, శ్రీనివాసులు, మదన్‌సాయి, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

# 2029 ఎన్నికల్లో జగన్‌కు 'జీరో' సీట్లు

● 'సూపర్ సిక్స్'తో వైసీపీ బ్యాచ్‌కు నిద్ర కరువు ● నియోజకవర్గంలో 27,535 మందికి తల్లికి వందనం ● తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసం ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తున్న జగన్‌కు 2029 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసి తగిన బుద్ధి చెప్పారన్నారు. దాంతో, మళ్ళీ ప్రజల ఆదరణ పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నాడన్నారు. దీంతో ఈ సారి వచ్చే ఎన్నికల్లో వైసీపీకి జీరో సీట్లు వస్తాయన్నారు. సూపర్ సిక్స్‌లో కీలక పథకమైన తల్లికి వందనం పథకం అమలు తో జగన్, వైసీపీ నేతల నోర్లు మూసుకుపోయాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశాడన్నారు. తంబళ్లపల్లె నియోజవర్గంలో 27,537 మంది ఖాతాల్లో తల్లికి వందనం పథకం నిధులు జమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో తప్పులతోపాటు, వివిధ కారణాలతో నియోజకవర్గంలో 3,500 మందికి తల్లికి వందనం నిధులు జమ కాలేదన్నారు. వైసీపీ తప్పులను సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి వచ్చే నెల 5వ తేదీన తల్లికి వందనం అందేలా చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదన్నారు. అమ్మఒడి కింద కేవలం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే నగదు ఇచ్చి ప్రచారం కోసం కోట్లాది రూపాయలు వృధా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు ముత్తకూరు మౌలా, మూగి రవిచంద్ర, విజయ్‌కుమార్, భజంత్రి రామాంజులు, రామకృష్ణమ రాజు, గోపాల్‌రాజు, ఫజులు, ఫాస్టర్ శ్రీనివాసులు, సుబ్బనాయుడు, గాలి నారాయణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

# 'యోగాంధ్ర' విజయవంతం చేయాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర 2025 కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని నిపుణుల పర్యవేక్షణలో భారీ స్థాయిలో నిర్వహించాలని అధికారులను సూచించారు. మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా కోసం అందరికీ అనువైన ప్రదేశాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులతో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ అమర్నాథ్, ఎంపీడీవో నాగార్జున, రీసర్వే డీటీ మానస, వీఆర్వోలు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# హార్సిలీహిల్స్ లో 1500 మందితో యోగా శిక్షణ

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూన్17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హార్సిలీహిల్స్ లో ఈనెల 19న యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. యోగా శిక్షణకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీస్థలాన్ని ఎంపిక చేశారు. వేదికనిర్మాణం, కార్పెట్లు సరఫరా, వెలుగు మహిళలు, కళాశాల విద్యార్థుల సమీకరణపై తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి తదితర అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. 19న ఉదయం 6.30కి అందరూ హార్సిలీహిల్స్ చేరుకోవాలని ఆదేశించారు. అంతకుమునుపు జిల్లా టూరిజం మేనేజర్ నాగభూషణం హార్సిలీహిల్స్‌కు చేరుకుని మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, వెలుగు తదితర శాఖల సిబ్బంది బాధ్యతలపై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ తోపాటు ఉన్నతాధికారులు హాజరు కానున్నందున అధికారులందరూ జాగ్రత్తగా పనిచేయాలన్నారు. ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ బాబాజాన్, ఏపీఎం రాజేశ్వరి, ఆర్ఐ వీరాంజ నేయులు, వీఆర్వో జయరాంరెడ్డి పాల్గొన్నారు.

# 'తల్లికి వందనం' కోసం తప్పని తిప్పలు

● సచివాలయం చుట్టూ తిరుగుతున్న మహిళలు


సచివాలయంలో జాబితాను పరిశీలిస్తున్న తల్లులు

రైల్వేకోడూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద అందించే నగదు ప్రయోజనం కొంతమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే కొంతమంది తల్లులు కోడూరు పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల వివరాలు పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు, తల్లుల బ్యాంకు ఖాతా వివరాలు సరిగా నమోదు కాకపోవడం, ఆధార్ కార్డుతో బ్యాంకు ఖాతా లింక్ కాకపోవడం వంటి సాంకేతిక లోపాల కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు గ్రామ సచివాలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అన్న ఆందోళనతో తల్లులు సచివాలయాల వద్ద పరిశీలిస్తున్నారు. జాబితాలో పేరు లేనివారు అర్హులైనప్పటికీ నగదు జమ కానివారు గ్రీవెన్స్ ద్వారా తమ వివరాలను మరలా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జూలై 5వ తేదీ లోపు తప్పనిసరిగా నగదు బదిలీ అవుతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇస్తున్నారు. సమస్యను పరిష్కరించుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని సాంకేతిక సహాయం అవసరమైన వారికి సచివాలయ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు. తల్లులు ఓపికగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కారం లభిస్తుందని వారు తెలిపారు.

### ఆటో, లారీ ఢీ - తప్పిన ప్రమాదం

గుర్రంకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జుగా మారింది. స్థానిక ఇందిరమ్మ కాలనీ వాసి మస్తాన్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మంగళవారం ఇందిరమ్మ కాలనీ నుంచి ఆటోలో బస్టాండుకు వస్తుండగా మదనపల్లె నుంచి రాయచోటి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రమాదంపై వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.



అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం



ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

# సన్నబియ్యం... విద్యార్థుల మోములో ఆనందం

- గతంలో ఉడికీఉడకని అన్నం తినలేక అవస్థలు
- లావు బియ్యానికి స్వస్తి పలికిన రాష్ట్ర ప్రభుత్వం

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తోంది. గతంలో అందిస్తున్న లావు బియ్యానికి బదులు సన్నబియ్యం అటు హాస్టళ్లకు, ఇటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇవ్వడంతో విద్యార్థులకు మంచి భోజనం అందుతోంది. లావు బియ్యంతో ఉడికీఉడకని ముద్దముద్దగా భోజనం ఉండేది. ఎంత జాగ్రత్తగా చేసిన అన్నం సరిగా అయ్యేది కాదని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. వీటన్నిటికి స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తోంది.

ఈ ఏడాది స్కూళ్లు తెరుచుకోగానే జూన్ మొదటి వారంలో ఈ బియ్యాన్ని ఆయా హాస్టళ్లకు, స్కూళ్లకు ప్రభుత్వం సరఫరా చేసింది. జూన్ 12వ తేదీన పాఠశాల పునఃప్రారంభం రోజు నుంచే ప్రారంభించారు. గతంలో స్కూళ్లు ముగిసే నాటికి హాస్టళ్లలో మిగిలిన లావు బియ్యాన్ని స్కూల్ పునఃప్రారంభ సమయంలో వండి వడ్డించేవారు. దాదాపు 50రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రావడం, ఆ సెలవుల్లో ఈ బియ్యాన్ని పట్టించుకోకపోవడంతో పురుగుపట్టడం జరిగేది. కొన్నిచోట్ల మిగిలిపోయిన బియ్యంతో అన్నం చేసినపుడు అందులో పురుగులు కూడా వచ్చేవని విద్యార్థులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది హాస్టళ్లలో మిగిలిపోయిన బియ్యాన్ని పూర్తిగా పక్కనపెట్టేసి పునఃప్రారంభమైన రోజు నుంచే కొత్త బియ్యం అది నాణ్యమైన సన్నబియ్యాన్ని విద్యార్థులకు వండి వడిస్తున్నారు. దీంతో హాస్టల్ విద్యార్థుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేయడం వారికి ఎంతో ఊరటనిస్తోంది. ఈ సందర్భంగా పలు హాస్టళ్లు, స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఈ పరిశీలనలో విద్యార్థుల నుంచి ప్రభుత్వం పట్ల సానుకూల స్పందన లభించింది. ఎప్పుడు లేని విధంగా ఈసారి మాకు ఇళ్లలో మంచి భోజనాన్ని ఇస్తున్నారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంటి భోజనంలా ఉంది





ఇపుడు మా స్కూల్లో పెడుతున్న అన్నం ఇంటి భోజనంలా ఉంది. గతంలో ముద్దగా ఉంటూ, ఉడికి ఉడకని అన్నం తినలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడు అన్నం పొడిపొడిగా, రుచికరమైన కూరలతో పాటు గుడ్డు ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

-నిహారిక 10వ తరగతి, సంతోష్ 6వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అహోబిలాపురం, పులివెందుల.

# 'సూర్యఘర్'తో విద్యుత్ బిల్లుల ఆదా

- ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్

చెన్నూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవ్యానాయక్ అన్నారు. చెన్నూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం సూర్యఘర్‌యోజన పథకంపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రస్తుతం అధిక విద్యుత్ బిల్లులు, కోతల సమస్యలన దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ ముందుచూపుతో పీఎంఎస్‌జీవై పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకంలో రూ.2లక్షలు ప్రాజెక్టుకు వ్యయం చేయాల్సి వస్తే అందులో ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, 3కిలో వాట్‌కు రూ.70 వేలు వంతున సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే సోలర్ పలకలు ఏర్పాటు చేసిన ఐదేళ్ల వరకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఈలోపు చిన్న పాటి సమస్య ఉన్నా, ఏర్పాటు చేయించిన కంపెనీనే ఉచితంగా సర్వీసు మెయింటెనెన్స్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు తప్పకుండా పీఎంఎస్‌జీవై ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజరు చలపతి, డీఈ వెంకటేశ్వర్లు, సబ్ ఇంజ నీర్లు స్రవంతి, వల్లూరు ఏఈ లావణ్య, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా 46వేల మంది రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.1018 కోట్లు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ సీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పశ్చిమ గోదారి జిల్లాలో రూ.296 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.256 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.131కోట్లు, మిగతా అనేక జిల్లాలో పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. జొన్నలకు రూ.76 కోట్లు, రాగులకు రూ.33లక్షలు పెండింగ్ ఉన్నాయని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు 85శాతం అమలు చేశామని కొందరు టీడీపీ నాయకులు అనడం విడ్డూరమన్నారు. సంవత్సరంలో పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం మాత్రమే అమలు చేశారన్నారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం మైనార్టీలకు 50ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలు అమలు కాలేదన్నారు. అప్పుడే 85శాతం అమలు అయ్యాయని చెప్పడం కరెక్ట్ కాదన్నారు.

# 4 వారాంతపు ప్రత్యేక రైళ్లు.. మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-నర్సపూర్, జాల్నా- తిరుపతి మార్గాల్లో నడుస్తున్న 4 వారాంతపు ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు దాకా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చర్లపల్లి-నర్సపూర్ మార్గంలో నడిచే (07233/07234) ప్రత్యేకరైళ్లు మార్గమధ్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే, జాల్నా-తిరుపతి మార్గంలో నడిచే (07609/07610) ప్రత్యేక రైళ్లకు మార్గమధ్యంలో పార్బూర్, సేలు, మాలావత్, పర్బానీ, గంగాకేర్, పర్లి, వైజనాథ్, లాతూర్, ఉద్గిర్, బీదర్, మార్పల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

లింగాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల గ్రామంలో మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పడి మూడు ఎకరాల అరటితోట దగ్ధమైంది. దీనికి డ్రిప్ ల్యాడర్ మొత్తం దగ్ధం కావడంతో రైతు యుగంధర్‌రెడ్డికి రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు.

# నిబంధనలు మార్చి ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారు

- జేఎన్టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆవేదన

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌లో నిబంధనలు మార్చి తమ ఉద్యోగాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని పులివెందుల జేఎన్టీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తమ సమస్యపై స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. గత పదిహేను సంవత్సరాలుగా కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా ప్రతి ఏడాది సర్వీసును పునరుద్ధరించేవారన్నారు. అయితే ఈ ఏడాది ఇంటర్వ్యూలు నిర్వహించి యదావిధిగా మా సర్వీస్‌ను పునరుద్ధరించారన్నారు. అయితే ఈనెల 16వ తేదీ కొత్తగా పలు అంశాలను చేర్చి పునరుద్ధరించుకోవాలని చెబుతున్నారన్నారు. కొత్తగా ఇచ్చిన అగ్రిమెంట్‌లో వేకెంట్ పొజిషన్‌లో తీసుకోవడం లేదని, ఎటువంటి సమాచారం లేకుండా సర్వీస్ నుంచి తొలగించే హక్కు వారికి ఉన్నట్లు పొందుపరిచారన్నారు. ఎలాంటి అన్యాయం జరిగినా పెద్దలను గాని, న్యాయస్థానాలను గాని ఆశ్రయించకూడదని పొందుపరిచారన్నారు. ఈనిబంధనలు తమకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రిన్సిపాల్ ఏమన్నారంటే..

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అగ్రిమెంట్ చేసుకోవాలని చెప్పామన్నారు. మీ ఉద్యోగ భద్రతకు భంగం కలగదని వివరించామన్నారు. జేఎన్టీయూ పరిధిలో అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలలు ఉన్నాయని, కేవలం పులివెందులలో మాత్రమే ఇలాంటి నిరసన వ్యక్తమవుతోందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ముందుకెళ్తామన్నారు.

# యోగాంధ్రను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో 18వ తేదీ బుధవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పాఠశాలల యజమానులు, ఎంఈవోలు, మండల మహిళా సమాఖ్య, ఆర్టీసీ, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని భారత ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 21వ తేదీ శనివారం వైజాగ్‌లో పాల్గొంటున్న సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గండికోటలో ఏర్పాట్లు పూర్తయ్యాయని... నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాగా, జమ్మలమడుగు నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కూటమి నాయకులు తెలియజేశారు.

# అయిదుగురు మట్కా నిర్వాహకుల అరెస్టు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని అలంకార్ ఫంక్షన్ హాలు వద్ద మట్కా నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, సిబ్బంది దాడి చేసి మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుంచి రూ.1,39,000లు నగదుతో పాటు మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో కానీ, గ్రామాల్లో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తున్నా, పేకాట ఆడుతున్నా సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

# నూనెపంటల సాగుకు ప్రోత్సాహం

- ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి



సాగులో ఉన్న పామాయిల్ చెట్లను చూపుతున్న శ్రీనివాసులరెడ్డి

పోరుమామిళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంట సాగు చేపట్టేందుకు ఉద్యానశాఖ రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పోరుమామిళ్ల డివిజన్ ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు ఉచితంగా దాదాపు 29వేలు విలువ కలిగిన మొక్కలను అందజేస్తామన్నారు. అలాగే పంటసాగుకు రూ21 వేలు రాయితీ రూపంలో అందిస్తారన్నారు. పంట తొలి దశలో స్వల్పకాలిక కూరగాయ, పప్పుధాన్య పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుంటే... అంతర పంటల సాగుకు సంవత్సరానికి రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాల్లో మరో 21వేల రూపాయలు ప్రభుత్వం రాయితీ రూపంలో అందిస్తుందన్నారు. అదనంగా పంట పొలానికి ఏపీ సూక్ష్మ నీటిపారుదల పథకంలో భాగంగా 90 నుంచి 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. పొలంలో నీటి వనరుల నిర్వహణ కోసం ఫారంపాండ్ నిర్మాణం చేపడితే మరో రూ.75వేలు రాయితీ ఉంటుందన్నారు. ఇక పండిన పంటను ప్రభు త్వంతో ఒప్పందం కుదుర్చుకుంటే.. కంపెనీనే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. పంట నాటిన నాలుగో సంవ త్సరం నుంచి కోతకు వచ్చి దాదాపు 30 సంవత్సరాల వరకు పంట ఉంటుందన్నారు. వివరాలకు రైతులు రైతు సేవా కేంద్ర సహాయకులకు కానీ, ఉద్యానశాఖాధికారికి కానీ సంప్రదించాలని తెలిపారు.

# ఐదుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలోని పుల్రాయునిపేట గ్రామ సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. మంగళవారం సాయంత్రం పుల్రాయునిపేట సమీపంలోని పొలాల్లో కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం అందిన సీఐ తన సిబ్బందితో వెళ్లి ఐదుగురిని అరెస్టు చేశారన్నారు. వారి వద్ద నుంచి రూ.56,350 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

# అదుపు తప్పి కాలువలోకి.. దూసుకెళ్లిన కారు



డ్రైనేజీ కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పి డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ పోస్టాఫీసుకు వెళ్లే దారిలో ఉన్నట్లుండి ఓ కారు డ్రైనేజీ కాలువలోకి దూసుకు వచ్చింది. ఈ సమయంలో ఎదురుగా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు కారును బయటకు తీయడంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

# బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీపుల స్టాండ్ పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, బహిరంగ మద్యం తాగినా కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్ బాష హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జీపుల స్టాండ్ వద్ద డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల జీపు స్టాండ్ పరసరాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, బహిరంగ మద్యం తాగుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారు ఎవరైన సరే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

# నో క్యాష్... నో క్యాష్

- నర్సాపురం ఏపీజీబీలో అందుబాటులో లేని నగదు
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు



నర్సాపురంలోని ఏపీజీబీ

కాశినాయన జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపు రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో నగదు అందుబాటులో ఉంచకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మారుమూల మండలం... ఉన్నది ఒకే ఒక బ్యాంక్... నెలలో నాలుగైదు రోజులు మినహా ఎప్పుడు బ్యాంక్‌కు వెళ్లినా అక్కడ సిబ్బంది చెప్పే మాటలు నో క్యాష్. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ.13000 చొప్పున బ్యాంక్‌లో జమ చేసింది. మరోవైపు రెండు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల డబ్బును విడుదల చేసింది. శని ఆదివారాలు బ్యాంక్‌కు సెలవు కావడంతో సోమ, మంగళవారం బ్యాంక్‌లో రద్దీ పెరిగింది. నగదు కోసం విద్యార్థుల తల్లులు, ఉపాధి కూలీలు బ్యాంక్‌లో క్యూకట్టారు. కానీ అక్కడి సిబ్బంది ముందు చూపుతో నగదు తెచ్చిపెట్టుకోవాల్సింది పోయి యదావిధిగా వచ్చిన వారికి కరోనా సమయంలో చెప్పినట్లు నగదు లేదు అనే రొటీన్ సమాధానమే చెప్పడంతో పలువురు ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారుల కనీస అవసరాలకు డబ్బును సర్దుబాటుచేయకపోతే ఇక బ్యాంక్ ఉండి ఏమి ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెల 10వ తేదీ వరకు డ్వాక్రా మహిళలు చెల్లించే డబ్బుతో బ్యాంక్‌ను అతికష్టం మీద నడిపిస్తూ వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిప డు నగదు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై బ్యాంక్ మేనేజరు ఇంద్రాణిని వివరణ కోరగా.. నగదు అందుబాటులో లేదన్న విషయం వాస్తవమేనని చుట్టుపక్కల బ్యాంక్ వాళ్లు ఎవరని అడిగినా నగదు ఇవ్వడం లేదన్నారు. దూరప్రాంతనికి పోయి తెచ్చుకుందామంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఈవిషయం పైఅధికారులకు కూడా చెప్పానన్నారు.



చాపాడు చానెల్ కాలువ

# కేసీ నీటి కోసం...

చాపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో కేసీ కెనాల్ సాగునీటికోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారు. తొలకరి వానలు కురవగానే భూముల్లో దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతారు. ప్రొద్దుటూరు, చాపాడు, దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని భూములకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్ సాగు నీరు. మిగిలిన భూములకు వ్యవసాయ ఫిల్టర్లు, బోరుబావులు ప్రధాన ఆధారం. ఈ ఏడాది జూన్ నెల రాగానే రైతులు ఆనందంతో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీరు కేసీ కెనాల్‌కు దాని ఉప కాలువలు అయిన చాపాడు చానెల్, ఏటూరు కాలువలకు అధికారులు నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం వర్షాలు ఇప్పటికి ఆశించిన స్థాయిలో కురవలేదు. అరకొర వర్షాలు పడడంతో రైతులు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. జిల్లాల్లో అన్ని మండలాల్లో కన్నా చాపాడు మండలంలో వరి పైరు ఎక్కువగా సాగు చేస్తారు. ప్రతి ఏడాది సుమారు 26 వేల ఎకరాల్లో వరి, పసుపు 600 ఎకరాల్లో, వేరుశనగ 5 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ప్రొద్దుటూరు మండలంలో సుమారు 5 వేలు, దువ్వూరులో 10 వేల ఎకరాలు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో 12 వేల ఎకరాల చొప్పున వరి పైరు సాగు చేస్తారు. ఈ మండలాల్లోని రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్టగా ఉపయోగించే జీలుగ విత్తనాలకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు అందజేయాలని కోరుతున్నారు. వరి విత్తనాల కోసం నెల్లూరు, నంద్యాల, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళుతున్నారు. రైతులు ఎక్కువగా జిలకర, నెల్లూరు, 999, నంద్యాల, జైశ్రీరాం వంటి రకాలను సాగు చేస్తారు. ప్రతి రోజు మేఘాలతో మబ్బులతో ఊరిస్తోంది తప్ప వర్షం కురవడం లేదు. వర్షం కురిసి కేసీకి సాగునీరు విడుదల చేస్తే పంటలు సాగు చేయవచ్చని రైతులు ఆశగా ఉన్నారు. జూన్, జూలై నెలలు మంచి అదును కాలం. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అందువలనే ఈ సమయంలోనే పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### సాగునీటిని విడుదల చేయాలి



ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాల రైతులు పంటలు సాగు చేస్తారు. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగుకు అనుకూలం. ప్రస్తుతం కేసీ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేస్తే ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తారు. ప్రభుత్వం ఆ ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

*- అస్రాన్, రైతు, గుంత చీపాడు గ్రామం*

### సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి



ప్రభుత్వం సబ్సిడీకి వరి, వేరుశనగ విత్తనాలు అందజేయాలి. జూన్ లేదా జూలై నెలలు పంటలు సాగు చేసేందుకు మంచి అదును. ఈ కాలంలో పంటలు సాగు చేస్తే ఎక్కువగా దిగుబడి వస్తుంది. అధికారులు విత్తనాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలి.

*- సుభద్ర, మహిళా రైతు, కేతవరం గ్రామం*

## యోగాంధ్రను విజయవంతం చేయండి

వల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి క్రిష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవతం చేయాలన్నారు. ఇప్పటికే సచివాలయం కింద యోగాడేలో పాల్గొనదలచిన సభ్యులను సంఖ్యను పెంచుకునేందుకు గ్రామాల్లో చిన్న చిన్న కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, తహసీల్దారు కార్యాలయం ,సచివాలయ సిబ్బంది, మంలడల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## రెండో రోజూ కొనసాగిన తల్లిదండ్రుల నిరసన

చక్రాయపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పిట్టా రమణ అనే హెచ్‌ఎం మాకు వద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనకు దిగారు. సోమవారం ఆ ఉపాధ్యాయుడు మాకువద్దంటూ పాఠశాలకు తాళంవేసినిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో మగళవారంకూడా విద్యార్థుల తల్లిదద్రులు ఆ ఉపాధ్యాయుడు మాకువద్దంటూ నిరసన వ్యక్తం చేశారు.

హెచ్‌ఎం ఎమన్నారంటే..: హెచ్‌ఎం పదవి నాకు వద్దు నేనుఉపాధ్యాయుడిగానే పనిచేస్తానని పిట్టారమణ అన్నారు. పిల్లలను క్రమశిక్షణలో పెట్టుకుంటాను కానీతల్లిదండ్రులు అర్థం చేసుకోవడం లేదని ఆహెచ్‌ఎం వివరణ ఇచ్చారు.

## భూములు అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోండి

పులివెందుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పలు దేవస్థానాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమయ్యాయని పులివెందుల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డికి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని లింగాల, పులివెందుల మండలాల పరిధిలో దాదాపు 500 ఎకరాల దేవాలయాల భూములు ఇతరుల పేరుతో నమోదయ్యాయన్నారు. వీటిని సర్వే చేసి తిరిగి దేవస్థానానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్యాక్రాంతమైన భూములను కాపాడి వాటినిరికార్డుల్లో పొందుపరచాలని కోరారు.

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

పులివెందుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన కుటుంబానికి అండగా నిలబడాలని పులివెందుల అర్బన్ సీఐ చాంద్‌బాష అన్నారు. మంగళవారంపట్టణంలోని న్యాక్ బల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆధ్వర్యంలో జాబ్ మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ చాంద్‌బాష నిరుద్యోగులను ఉద్దేశించి ప్రసగించారు. దాదాపు 276 మంది అభ్యర్థులు హాజరుకాగా 89 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు న్యాక్ అధికారులు తెలిపారు.

## ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

● డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి



ఓపెన్ ఫోరమ్‌లో పీడీ ఆదిశేషారెడ్డి, అధికారులు

సింహాద్రిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మంగ్లవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ పథకంలోని సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. సామాజిక తనిఖీ బృందం సేకరించిన వివరాలు పంచాయతీ వారిగా బహిరంగ సభలో వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, డీవీఓ జుబేదా బేగమ్, ఎస్‌టీఎమ్ లోకేష్‌రెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరాముడు, ఏపీఓ జయభారతి, ఎస్‌ఆర్పీ నాగార్జున ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం'

కమలాపురం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగిస్తోందని నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం లో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తయిందని, ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం నాయకులు సంబరాలు చేసుకోవడం నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసగించినందుకా అని ఎద్దేవా చేశారు . కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయండి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కూడా తల్లికి వందనం వర్తింపజేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం ప్రతినిధి సుంకర రవి కోరారు. మంగళవారం కడప నగరం కార్పొరేషన్ కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు.



# పాపం.. పాపాఘ్ని..!

●డంపింగ్‌యార్డులా మారిన నది ●ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు
●ఏపుగా కంపచెట్లు...మురుగునీటితో దుర్వాసన



వేంపల్లె పాపాఘ్ని నదిలో ఏపుగా పెరిగిన కంపచెట్లు, దుర్గంధం వెదజల్లుతున్న మురుగుకుంటలు

వేంపల్లె,జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వేంపల్లెలోని పాపాఘ్నినది ఎంతో సుందరంగా ఉం డేది. ప్రతి ఏడాది నీళ్లు పారుతుండడంతో ఇవతల గట్టు నుంచి అవతలి గట్టు వరకు చదునుగా ఉండేది. కళ్లుమూసుకొని సుమారు కిలోమీటర్ మేర ఉన్న నదిలో వెళ్లినా ఎలాంటి ఇబ్బంది కలిగేది కాదు. కానీ ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగడంతో ఎక్కడపడితే అక్కడ గోతులు ఏర్పడ్డాయి. మరోవైపు పాపాఘ్నినదిలో చాలా ప్రాంతంలో ఏపుగా కంప చెట్లు పెరిగాయి. దీనికి తోడు పట్టణంలోని వ్యర్థాల న్నీ పాపాఘ్ని నదిలోనే వేస్తున్నారు.ప్రస్తుతం పాపం పాపాఘ్ని అన్న తీరుకు మారిపోయింది. ఇదే తీరులో ఇసుక యథేచ్ఛగా తరలడం, వ్యర్థాలన్నీ నదిలో వస్తే భవిష్యత్తులో పాపాఘ్ని రూపు రేఖలే మారిపోయే అవకాశం లేకపోలేదు.

**20అడుగుల మేర తగ్గిన నది..వ్యర్థాలన్నీ అందులోనే..:** వేంపల్లె పట్టణానికి పాపాఘ్నినది నీటి ఆదరువు. అక్కడి నుంచే పట్టణానికి ఫిల్టర్ల ద్వారా తాగునీరు అందుతోంది. అయితే ఈ 20 ఏళ్లలో ఇసుక యథేచ్ఛగా తరలిపోవడంతో సుమారు 20 అడుగుల మేర లోతుకు తగ్గిపోయింది. కొన్ని సంవత్సరాలుగా ఎస్సీ కాలనీ సమీపం, మఠం వీధి, బిడాలమిట్ట ప్రాంతాల్లో వ్యర్థాలను యథేచ్ఛగా నదిలో కుప్పలు కుప్పలుగా పోయడంతో ఆ ప్రాంతమంతా నది స్వరూపం కనిపించకుండా పోయింది. ఇసుక కనిపించకుండా వ్యర్థాలే ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు నదిలో కలపకుండా పంచాయతీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రించడంతో యథేచ్ఛగా నదిలో పడేస్తున్నారు. ఇంటి నిర్మాణంలో ఉన్న వ్యర్థాలు, చికెన్ దుకాణాల వ్యర్థాలు, కొన్నిసార్లు పట్టణంలోని చెత్తాచెదారం వ్యర్థాలు కూడా నదిలో వేసున్నారు. దీనికి తోడు నదిలో పెద్దపెద్ద కంపచెట్లు పెరిగిపోయాయి. పట్టణంలోని మురుగునీరంతా నదిలోకి వెళ్తుం డడంతో కొన్నిచోట్ల నదిలో చేరి దుర్గంధంగా తయారైంది. వ్యర్థాలను వేయనీయకుండా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగిస్తే భవిష్యత్తులో పాపాఘ్ని నది స్వరూపం అలాగే ఉండే అవకాశం ఉంది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





వేంపల్లె పాపాఘ్ని నదిలో కుప్పలు కుప్పలుగా పడవేసిన వ్యర్థాలు, మట్టి, రాళ్లు, చెత్తాచెదారాలు తదితరాలు

## 'ఆ భూములు దళితులకే చెందాలి'

కడప సెవెన్ రోడ్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దళితులకు మంజూరు చేసిన భూములు దళితులకే చెందాలని, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మడగలం ప్రసాద్ అన్నారు. మగళవారం రెండోరోజు ఆర్డీఓ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న రిలేనిరాహార దీక్షల సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దళితుల సమస్యలు పాలకులకు అధికారులకు, ఏమాత్రం పట్టడం లేదని విమర్శించారు. దళితులు కేవలం ఓటు బ్యాంకుగామాత్రమే చూస్తున్నారని వారి సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం, పాలకవర్గాలు పూర్తిగా విఫలం చెందాయని అన్నారు.

## విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలి

వల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వల్లూరులో ఉన్న కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బాలికలు తమ ఉపాధ్యాయులు చెప్పినన రీతిలో క్రమశిక్షణగ మెలిగితే వారు అబివృద్ధి బటలో ఉంటారన్నారు. సమావేశంలో పాఠశాల ఎస్‌వో నజీమున్నీసా ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచడం బాధ్యతగా స్వీకరించాలి



మొక్కను నాటుతున్న వైద్యలింగం తదితరులు

కడప సెవెన్ రోడ్స్ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మొక్కలుపెంచడం ఒక బాధ్యతగా స్వీకరించాలిని ఎల్‌ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ (హైదరా బాద్) రీజనల్ మేనేజర్ పీజీ కుమార వైద్య లింగం అన్నారు. కడప ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలకు కేంద్ర ప్రభుత్వంనిర్దేశించిన ఈఎస్‌జీ పాలసీలో పర్యావరణ సమతుల్యత కాపాడడం కోసం పనిచేయడం ఒక ముఖ్యమైన బాధ్యతన్నారు. ఈ బాధ్యతను నిర్వర్తించడంలో ఎల్‌ఐసీ అగ్రశ్రేణిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ , ఓఎస్ మేనేజర్ సత్యప్రసాద్,అధికారులు రమణ, మహేశ్వర్‌రెడ్డి, సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాహుకాల పూజలు



కడప కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలుగావించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు.

## ఆప్కాస్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

కడప సెవెన్ రోడ్స్‌జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చాలీచాలని వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్న ఆప్కాస్ ఉద్యోగుల అందరికీ తల్లికి వందనం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వ, చంద్రబాబు మాటలు నిలబెట్టుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.సి.బాదుల్లా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన నూతన డీఐపీఆర్‌వో



కడప, కలెక్టరేట్, జూన్17, (ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.పద్మజ మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

# కల్లూరుపల్లెరోడ్డు కంపచెట్లమయం



చక్రాయపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన కల్లూరుపల్లె రోడ్డును కంపచెట్లు ఆక్రమించాయి.వాహనాల రాకపోకలు జరగాలంటే కంపచెట్లు పూర్తిగా రోడ్డును ఆక్రమించాయి. ఒకే వాహనం పోతే తప్ప ఎదురుగా వాహనం వస్తే నిలబెట్టుకోవాల్సిందే, లేదంటే కంపచెట్లు తగలాల్సిందే. వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంది. మారుమూల ప్రాంతం కావడంతో వారినిఎవరూ పట్టించుకోవడం లేదని, గ్రామంలో సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే ఉన్నాయని వాపోతున్నారు. కల్లూరుపల్లెకు ఒక బస్సు వస్తుంది ఆ బస్సు కూడా ఈ కంపచెట్ల వలన ఇబ్బందిగా ఉందని డ్రైవర్ తెలుపుతున్నట్లు తెలిపారు. కల్లూరుపల్లెతో పాటు సిద్దావాండ్లపల్లె, కాట్రగంటవారిపల్లె, ఇసుకలోల్లపల్లె, కల్లూరుపల్లెతాండా లాంటి గ్రామాలకు వెళ్లేందుకు ఇదే దారి. అలాగే ఇటువైపు ఎస్‌పీ కుంట, నడింపల్ల,కదిరి, కోకన్నపేట,అనంతపురం దారి వెళ్లాలన్న ఈ దారిలోనే వెళ్లాలి. ఈకంపచెట్ల వల్లన చాలా ఇబ్బందిగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించి వాహనదారులను కాపాడాలని కోరుతున్నారు.

**చిన్నకుడాలలో 21న గజ్జలపూజ**

లింగాల,జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకుడాల గ్రామంలో ఈనెల 21వతేదీ శనివారం గజ్జల పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ మేనేజర్ అంకయ్య సోమవార ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8గంటలకు గజ్జల పూజ, కలశంపూజకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం రాత్రి 8గంటల నుంచి కోలాటం ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు ఉంటుందన్నారు. అనంతరం మహామంగళహారతితో కోలాట ప్రదర్శన ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



# విత్తనశుద్ధి తప్పనిసరి



వీరపునాయునిపల్లె... సూచనలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

సీకేదిన్నె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ బి.చంద్రానాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లె, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఈశ్వర్‌రెడ్డి, ఎంఏఏ శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్..:** పొలంపిలుస్తోంది కార్యక్రమం ద్వారా అవగాహన పెంపొందించుకోవాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలోని రైతు సేవా కేంద్రంలో ఏఓ చెన్నారెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయకులు రాఘవ, కీర్తన, మల్లికార్జున, ఎలీష, రైతులు పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లె..:** భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డిపాల్గొన్నారు. మంగళవారం మండలంలోని అనిమెల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏవో శ్యామ్‌బాబు, కమలాపురం సాంకేతిక వ్యవసాయాధికారి నాగభూషణంరెడ్డి, వ్యవసాయ సహాయకులురెడ్డప్ప, రైతులు పాల్గొన్నారు.

**వల్లూరు..:** పంటలు వేసుకునేటప్పుడు రైతులు విత్తనశుద్ధి తప్పనిసరి అని ఏవో కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం వల్లూరు మండలంలోని బాలుగారిపల్లె గ్రామం, ఇసుకపల్లె గ్రామల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సహాయకురాలు సురేఖ, పశుసంవర్థకశాఖ అధికారులు, రెతులు పాల్గొన్నారు.

**కమలాపురం రూరల్..:** ప్రతి రైతు పంట ఉత్పత్తుల కోసం మేలైన రకం విత్తనాలను ఎంచుకోవాలని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జి.గాయత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

**వేముల..:** పత్తి పంటలో రసం పీల్చు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జి.పి. ఓబులేసు రైతులకు సూచించారు. మంగళవారం చాగలేరు, గుండ్లపల్లె గ్రామాలో పత్తి పంటను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, ఎంపీఈఓ లక్ష్మి, సర్పంచు అర్జున్, రైతులు పాల్గొన్నారు.

**లింగాల..:** మెరుగైన యాజమాన్య చర్యలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో రమేష్ తెలిపారు. లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము పంటకు సంబంధించిన యాజమాన్య చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**చెన్నూరు..:** రైతులు ఆరోగ్యవంతమైన పంటను పండించుకోవాలంటే ఘన జీవామృతం తప్పక వాడాలని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్‌కుమార అన్నారు. మండలంలోని చిన్నమాచుపల్లెలో మంగళవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీదేవి,సిబ్బంది రెడ్డినాగేశ్వరి, వెంకటయ్య, నరసింహులు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**వేంపల్లె..:** వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సాంకేతికతను ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని వేంపల్లె ఏవో శివశంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బక్కన్నగారిపల్లె, గిడ్డంగివారిపల్లె, వెలమవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంనిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.





వేములలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో ఓబులేసు, లింగాలలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్

## శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బద్వేలుటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలో వెలసిన మహాలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి అభయాంజనేయ స్వామి ఆలయ దశమవార్షిక బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు వల్లెంకొండ వెంకటరమణ, ఆలయ ప్రధానార్చకులు వీరేశాచార్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని వారు తెలిపారు.

## ఎంఐజీ భూములు పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

బద్వేలు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అబ్బుసాహెబ్‌పేట, సి.కొత్తపల్లె గ్రామాల్లో ఉన్న ఎంఐజీ భూములను మంగళవారం డిప్యూటీ కలెక్టరు శిరీషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఐజీ భూముల్లో వెంచర్లు వేసి ప్రజలు ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉండేటట్లు కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని ఆమె తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని వినతి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమ్మలమడుగు నుంచి బయటి మండలాలకు చుట్టూ తిరుగుతున్నా తల్లిదండ్రులు గత నాలుగు నెలల క్రితం నుంచి ఎక్కడ ఆధార్‌సెంటర్ పనిచేయలేదని ముద్దనూరు సచివాలయంలో ఆధార్‌సెంటర్ పనిచేయడంలేదని, అలాగే మెయిన్ పోస్టాఫీసు నందు మైలవరం, ముద్దనూరు, తదితర మండలాలకు వెళ్లినా కొన్ని చోట్ల ఆధార్ సెంటర్లు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పెద్దముడియం మండలం వెళ్లి ఆధార్‌సెంటర్ వద్దకు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆధార్‌సెంటర్లు తెరవాలని కోరారు.

## హౌస్‌హోల్డ్ మ్యాప్‌లో ఉపాధ్యాయుడి ఆధార్ లింక్...!

**●'తల్లికి వందనం'లో అర్హులకు అన్యాయం**

ముద్దనూరు జూన్17(ఆంధ్రజ్యోతి):గతంలో జరిగిన హౌస్ హోల్డ్ సర్వేలో నిరుపేద కుటుంబానికి చెందిన గోర్ల గోపాలక్రిష్ణ అనే వ్యక్తి కుటుంబంలోకి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయ కుటుంబం వచ్చి చేరడంతో ఆ పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు దక్కని పరిస్థితి ఏర్పడింది.వివరాల్లోకి వెళితే...మండల పరిధి ఉప్పలూరు గ్రామ పంచాయతీలోని మారుమూల ప్రాంతం చిన్నకత్తెర పల్లె, గోర్ల గోపాలక్రిష్ణ అతని భార్య సుభద్ర వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగి స్తున్నారు. వారికి ముగ్గురు సంతానం లేఖన (5వతరగతి), నందన్(3వతరగతి), జానకీరామ్(2వతరగతి) చిన్నకత్తెర పల్లెలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. రెండు రోజుల క్రితం కూటమి ప్రభుత్వం అందించిన తల్లికి వందనం పథకం ఆ నిరుపేద కుటుంబంలోని చిన్నారులకు అందలేదు.ఎందుకు అందలేదని విచారిస్తే ఓ ఉపాధ్యాయ కుటుంబం ఆధార్ వీరికి లింక్ అవడంతో కోల్పోవాల్సి వచ్చిందని బయటపడింది.దాంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో కూడా అనర్హత పడింది. హౌస్ హోల్డ్ జాబితా నుంచి ఉపాధ్యాయ కుటుంబాన్ని తొలగించాలన్నా, తొలగింపు ఆప్షన్ లేకపోవడంతో ఆ నిరుపేద కుటుంబ ఆవేదన చెందుతుంది. కేవలం ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ కుటుంబంలో చేరికతోనే తమ పిల్లలకు తల్లికి వందనం దక్కలేదని,కలెక్టర్ గారు మాకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



# ఖరీఫ్ సాగులో రైతన్నలు బిజీబిజీ

రాజుపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కుందూ పరివాహక ప్రాంతంలో ఖరీఫ్ పంటల సాగులో రైతన్నలు బిజీగా ఉన్నారు. మే నెలలో వర్షాలు పడడంతో కుందూనది పరివాహంతోపాటు బోర్ల కింద పసుపు, మొక్కజొన్న, మిరపపంటలు రైతులు జోరుగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పసుపు దిగుబడి బాగా రావడంతో క్వింటాలు ధర రూ.12వేలు పలుకుతుండడంతో ఈ పంటలపై రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అదే విధంగా మొక్కజొన్న కూడా వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడి వస్తుందని ఆదిశగా రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈవారంలో దాదాపు వంద ఎకరాలు పంటలు సాగులోకి వచ్చే పరిసితి ఉందని రైతులు పేర్కొంటున్నారు. మిగతా రైతులు మరింత వాన పడి కేసీ కెనాల్‌కు నీరు వస్తే ఈ పంటల సాగు పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఖరీఫ్ పంటల సాగులో రైతన్నలకు ముందస్తుగా సంసిద్ధమయ్యారు



పసుపు విత్తనం వేస్తున్న కూలీలు

## పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూపులు

అట్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని రైతులు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగల కోసం ఎదురుచూస్తున్నారు. మే , జూన్ నెలలలో ఖరీఫ్ సాగులో వరి ఇతరత్రాపంటల కోసం పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు జనుములు రెండు నెలలు మునుపుగానే చల్లుతారు. వాటిని ఏపుగా పెంచిన తరువాత రోటవేటరుతో కలియదున్నడంతో పచ్చిరొట్ట ఎరువులు ఎంతగానో దోహదపడతాయని రైతుల అభిప్రాయం. కానీ ఈ ఏడాది జూన్ నెల ముగుస్తున్నా ఇప్పటికీ అట్లూరు మండలంలోని రైతు సేవాకేంద్రాలకు జీలుగలు, జనుములు చేరకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా అట్లూరు మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ వివరాల మేరకు ప్రతి ఏడాది మే, జూన్ మొదటి వారంలో రైతు సేవా కేంద్రాలకు పచ్చిరొట్ట విత్త నాలు మంజూరై పంపిణీ కూడా జరిగేదని, ఈ ఏడాది ఆలస్యం జరి గిందని మరో వారంలో జనుములు, జీలుగలు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తుందని వివరించారు.

## యోగాతోనే ఆరోగ్యం



ప్రభుత్వ ఇంటర్ కాలేజిలో విద్యార్థులతో యోగా చేయిస్తున్న లెక్చరర్

ఎర్రగుంట్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు నిత్యం యోగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ ఇంటర్ కాలేజీ ప్రిన్సిపాల్ త్రివిక్రంరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నిత్యం యోగా క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కూడా విద్యార్థుల చేత యోగా క్లాసులు నిర్వహించారు. యోగా చేస్తే ఆరోగ్యం బాగా ఉంటుందని, జ్ఞాపకశక్తి కూడా బాగా పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఇంటర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్లలో:** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ చెన్నక్రిష్ణయ్య అన్నారు. మంగళవారం పోరుమామిళ్ల లోని గిరిజన సంక్షేమ వసతి రెసిడెన్షియల్ స్కూలులో అం తర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా వారంరోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీఈ టీ అనిల్‌కుమార్, వెంకటర మణ, స్వర్ణలత, జయరాజ్, ఎఎన్ఎం రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్

బద్వేలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పారిశుద్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టి బద్వేలును పరిశుభ్ర బద్వేలుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శా నిటేషన్ సిబ్బందితో సమావే శం నిర్వహించారు. పారిశద్యం మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు ఆయా షాపుల యజమానులు రోడ్లపై చెత్త వేయకుండా చూడాలన్నారు. అలాగే శానిటేషన్ సెక్రటరీలు ఫీల్డ్‌లో పర్యటిస్తూ రోడ్లపై చెత్త వేసేవారికి జరిమానా విధించాలన్నారు. తద్వారా పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకున్నవారమవుతామన్నారు. దీంతో పాటు షాపుల యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు ప్రతి షాపుకు ఉండేలా చూడాలని సూచించారు.

## విద్యుత్ లైన్ మార్పు..కొత్త స్తంభం ఏర్పాటు




ఖాజీపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఉదయం కొత్త స్తంభం ఏర్పాటు చేసి మార్చి వేశారు. ఈ విషయమై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'విద్యుత్ వైర్లు ఇలా.. నాణ్యత ఎలా..?' అన్న కథనం ప్రచురితం కావడంతో ఖాజీపేట ఇన్‌చార్జి ఏఈ నాగరాజు స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేసి అతుకులు లేని వైర్లు ఏర్పాటు చేయించారు. ఇలా చేయడం వల్ల బ్రేక్‌డౌన్ రాదని రైతులు, ప్రజలు పేర్కొంటూ 'ఆంధజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తే రైతులకు నాణ్యమైన విద్యుత్ వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

## 'తల్లికి వందనం'తో తల్లిదండ్రుల ఆనందం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ముద్దనూరు జూన్17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అందడంతో మంగళవారం పిల్లలు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమేరకు సువిధ స్కూల్‌లో.కరెస్పాండెంట్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలు, తల్లిదండ్రులు కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.ఇచ్చిన మాటను నిలుపుకున్న విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి,కేశవరెడ్డి,చంద్ర ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షర్మిల ఫోన్ ట్యాప్ చేసిన వారిని శిక్షించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఫోన్ ట్యాప్ చేసినవారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాష డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిల తెలంగాణాలో పార్టీ ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నప్పుడు 2021లో ఆమె ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు తెలుస్తోందన్నారు. తెలంగాణా రాష్ట్రం చేపట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో షర్మిల ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు వెల్లడైందన్నారు. ట్యాపింగ్‌కు పాల్పడినవారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## నాడు-నేడు పనులు పూర్తి చేయండి

బ్రహ్మంగారిమఠం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) :బ్రహ్మంగారిమఠం మండలంలోని ప్రభుత్వ హైస్కూలులో జరుగుతున్న నాడు-నేడు పనులు పూర్తి చేసి విద్యార్థులు చదువుకోవడానికి సహకరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాహుల్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని నవోదయ పాఠశాల ప్రారంభించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగులో ఉన్న భవనాలు పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సందీప్ పాల్గొన్నారు.

## సీపీఐ రూరల్ కార్యదర్శిగా ఇమ్మానుయేల్



బద్వేలు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రూరల్ కార్యదర్శిగా నాగదాసరి ఇమ్మానుయేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బద్వేలు సీపీఐ మండల రూరల్ మహాసభలు జరుగుతున్న స్థానిక ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి కాలనీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తనను రెండో దఫా రూరల్‌కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శితో పాటు 20 మందితో కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా సమితి, జిల్లాపార్టీ కార్యదర్శి గాలిచంద్రకు ,ఏరియా నిర్మాణ బాధ్యులు వడ్డమాను వీరశేఖర్‌కు, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్‌కు ఏరియా పార్టీ సమితికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో సీపీఐ పార్టీబలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయాలి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి ఉత్తర కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. కాల్వకు నీటిని విడుదల చేయడానికి ముందు కాలువల్లో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గండికోటలో బుధవారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కోకన్వీనర్ గౌరీశంకర్ కోరారు. 21న వైజాగ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్న సందర్భంగా బుధవారం యోగాంధ్ర నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ చేకూరి శ్రీధర్, భూపేశ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

## సీపీఐ మహాసభలకు తరలిరండి

పోరుమామిళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ కార్యవర్గసభ్యుడు చెన్నయ్య కోరారు. ఈ నెల 23న జరిగే మహాసభలకు సంబంధించి పోస్టర్లను ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

## పథకాలపై అవగాహనతో లబ్ధి పొందాలి

పోరుమామిళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పొలం పిలుస్తోందిలో పాల్గొని పథకాల గురించి అవగాహన పొంది లబ్ధి పొందాలని పోరుమామిళ్ల వ్యవసాయాధికారి కల్లూరి చంద్రమోహనరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుల్లీడు గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతు రైతు సేవా కేంద్రంలో గ్రామసభ ఏర్పాటు చేసి వ్యవసాయశాఖ ద్వారా అమలు చేసే పథకాల గురించి రైతులకు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవయశాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అన్ని పథకాల గురించి అవగాహన కల్పించి సకాలంలో సాగు సలహాలు, సూచనలు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుటకు తీర్చిదిద్ది అధిక ఆదాయం వచ్చేలా చేయనుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయసంచాలకులు మురళీధర్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

**బి.కోడూరులో:** మండల పరిధిలోని రామసముద్రం గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారి కౌశిక ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయశాఖ ద్వారా అమలు చేసే పథకాల గురించి అవగాహన పొందాలన్నారు. అలాగే రైతులు వేసిన పొలాలకు మందు పిచికారి చేసేందుకు డ్రోన్ 30 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తుందని ఆసక్తి గల రైతులు సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఆమె తెలి పారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈకేవైసీ ఆటో అప్‌డేట్ చేశారని పెండింగు లిస్టు రైతు సేవాకేంద్రంలో ఉన్నాయని వారంతా కూడా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.1

## తల్లికి వందనంతో ప్రతి గడపలో ఆనందం

**●వైసీపీ వి దిగజారుడు వ్యాఖ్యలు ●టీడీపీ నేత రితేష్‌కుమార్‌రెడ్డి ధ్వజం**



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంతో ప్రతి గడపలో ఆనందం వెల్లివిరుస్తోందని బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు, వేగంగా రాష్ట్రాభివృద్ధి జరగడంచూసి ఓర్వలేని వైసీపీ నాయకులు తల్లికి వందనం పథకంపై విషం చిమ్ముతూ దిగజారుడు వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అమలు చేస్తుండటంతో రాష్ట్ర ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తోందన్నారు. అలాగే డొక్కా సీతమ్మ పథకం ద్వారా సన్న బియ్యంతో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, మస్తాన్‌బాబు, రామానాయుడు పాల్గొన్నారు.

## అదనంగా కట్టడాలు చేసిన ఇళ్లకు సర్వే

**●మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్**



జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అదనంగా కట్టడాలు నిర్మించినవారికి ఇంతవరకు పన్నులు లేని నిర్మాణాలకు తమ సిబ్బంది సర్వే చేస్తున్నారని అనంతపురం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి, రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి పట్టణంలో గత వారం రోజుల నుంచి మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక సిబ్బంది చేస్తున్న సర్వేను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు మున్సిపాలిటీ గ్రేడ్-3లో ఎంపికైన విషయం అందరికి తెలిసిందేనన్నారు. అయితే మున్సిపాలిటీ పరిధిలో అదనంగా కట్టడాలు నిర్మించినవారికి ఇంతవరకు పన్నులు లేని నిర్మాణాలకు తమ సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. అయితే కొందరు మున్సిపాలిటీలో సర్వే వల్ల పన్నుల భారం పెరుగుతుందేమోనని భయపడుతున్నారని అలాంటి భయాలు ఏమీ వద్దని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు కమిషనర్ వెంకటరామిరెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు తల్లికి వందనం పడేలా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బి.కోడూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులు అందుబాటులో ఉండి అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం పడేలా న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పులు తడకగా రీసర్వే నిర్వహించి ఎల్‌పీ నెంబరు అవకతవకలుగా ఇవ్వడంతో విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం డబ్బులు పడలేదన్నారు. ఇప్పటికే బి.కోడూరు మండలంలో దాదాపు 650 మందికి తల్లికి వందనం నిధులు పడలేదన్నారు. అధికారులు అందుబాటులో ఉండి అర్హులైప ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, గోడి రమణారెడ్డి, మున్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్

బద్వేలుటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే తెలుగుదేశంపార్టీ లక్ష్యమని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ప్రతి ఇంట్లో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరినీ చదివించుకోండని భరోసా ఇచ్చారని ఆయన అన్నారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కేవలం సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేశాడని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణయ్య, గంటా వెంకటయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


## సీసీరోడ్డు నిర్మాణానికి స్థలపరిశీలన



సీసీరోడ్డు నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నుంచి మెయిన్‌రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మాణానికి మంగళవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణం నుంచి తోట్లపల్లె మెయిన్‌రోడ్డువరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అందుకు సంబంధించిన అంచనా మొత్తాన్ని జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని తెలుగుగంగ ప్రాజెక్టు సమీపంలో ఉన్న కొత్తబస్వాపురం గ్రామంలో సీసీ రోడ్డు లేకపోవడంతో వాహనాలు మట్టిరోడ్డుపై పోవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యేకు విషయం అర్జీరూపంలో అందించడంతో అధికారులు రోడ్డు కోసం స్థలాన్ని పరిశీలించి రోడ్డుకు అవసరమయ్యే అంచాన మొత్తాన్ని నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కాగా మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి అందుకు అవసరమయ్యే నిదులపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ డీఈ మధుసూదన్‌రావు, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి. బీమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, కాణాల మల్లిఖార్జునరెడ్డి, గంగరాజు, సన్నపూరి శ్రీను, రేకలకుంట శివ, మస్తాన్ పాల్గొన్నారు.

## పలు సమస్యలపై భూపేశ్‌రెడ్డికి వినతులు



కార్యకర్తలతో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి సమస్యలపై వినతి పత్రాలు అందించి పరిష్కరించాలని కోరారు. భూపేశ్‌రెడ్డి స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్యకర్తలకు తెలిపారు. అధికంగా రెవెన్యూ సమస్యలు, గ్రామాల్లో రోడ్లు, రేషన్ డీలర్లు, పాఠశాలలో వంట ఏజెన్సీలపై వినతిపత్రాలు ఇచ్చారు.

## డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డికి సన్మానం



ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డిని మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంకధార నరేంద్ర రావు ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా కోశాధికారి సి. విజయలక్ష్మి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడునాగార్జున, జిల్లా కార్యదర్శి నేరేళ్ల మల్లికార్జునరావు, సభ్యులు కుమారి, శివనాగి రెడ్డి, గౌరీ, శివకుమార్, పరమేశ్వరరావు, శ్రీశ్రీ రవితేజ తదితరులు పాల్గొన్నారు.